క్లుప్తంగా

ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సన్మానం

మదనపల్లె : జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన యల్లంపల్లె ప్రశాంత్‌ను శనివారం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు ఓంప్రకాష్, సెక్రటరీ దేవతా సతీష్‌లు దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్మికులు

వాల్మీకిపురం : కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్మికులు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ఆమోదించి, గవర్నర్ ఆమోదం లభించడంతో చట్టరూపం సంతరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, పంచాయతీ కార్మికులు శ్రీరాములు, రమణ, వెంకటేష్, చంద్ర, రాజు, హరినాథ్, వెంకట్రమణ, శ్రీనివాసులు, గురవయ్య, వసంతమ్మ, అనురాధ, భారతి తదితరులు పాల్గొన్నారు.

28న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 28న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్సీ నిరంజన్ తెలిపారు. సర్వీసులకు రిజర్వేషన్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. 28న ఉదయం 9 గంటలకు బయలుదేరి తిరిగి 29న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను టిక్కెట్టు రూ.805 చెల్లించాలన్నారు. నాలుగు టిక్కెట్లు కంటే ఎక్కువ ఉంటే ఇంటి వద్దకే వచ్చి టిక్కెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9959225677,9160186645 సంప్రదించాలన్నారు.

ఆర్సీ కార్డుల సమస్యకు త్వరలో పరిష్కారం

– ఆర్టీఓ భరత్ చవాన్



మాట్లాడుతున్న ఆర్టీఓ భరత్‌చవాన్, ఎంవీఐ దినేష్‌చంద్ర

మదనపల్లె : రవాణాశాఖకు సంబంధించి వాహనదారులు చాలాకాలంగా ఎదుర్కొంటున్న ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డు సమస్యలకు త్వరలో పరిష్కారం లభించనున్నదని జిల్లా రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఆర్టీఓ) భరత్‌చవాన్ తెలిపారు. అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా శనివారం మదనపల్లె రవాణాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, పారదర్శక పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. చాలామంది ప్రజలు రవాణాశాఖకు సంబంధించి కార్డులు జారీచేయకపోవడంతో పోలీసుల తనిఖీల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ప్రమాదరహిత జిల్లాగా అన్నమయ్యను మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్య పాల్గొన్నారు.

దళితవాడలో టీటీడీ రామాలయం

కురబలకోట : మండలంలోని అంగళ్లు పెద్ద దళితవాడలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రామాలయాన్ని శనివారం ప్రారంభించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్, జిల్లా సహ కన్వీనర్ పూజారి వేణు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇలాంటివి 19 ఆలయాలు నిర్మించడం జరిగిందన్నారు. అన్నీ ప్రతిష్ట పూర్తి చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో బయ్యారెడ్డి, కేశవాచార్యులు, వెంకటరమణరెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, సామశేఖర్‌రెడ్డి, గోపాల్, దేవేంద్ర, రెడ్డెప్పరెడ్డి, సుధాకర్, శెట్టి భానుప్రకాష్‌తో పాటు అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

పీలేరు : చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐవో) ఉషశ్రీ అన్నారు. శనివారం స్థానిక చెన్నారెడ్డి వీధిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాల సంఖ్యను తగ్గడానికి వ్యాధినిరోధక టీకాలు దోహదం చేస్తాయని తెలిపారు.

దేవీ రూపం..చూసే కళ్లదే భాగ్యం



మదనపల్లె సిటీ: రాజరాజేశ్వరి అలంకరణలో..



మదనపల్లె సిటీ: వాసవీ అమ్మవారి ఊరేగింపులో ఆర్డీవో మురళి



మదనపల్లె సిటీ : వీణ వాయిస్తున్న మీనామూర్తి బృందం

మదనపల్లె సిటీ : దేవీ నవరాత్రుల సందర్భంగా మదనపల్లె పట్టణంలో శనివారం అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం అభిషేకాలు , పూజలు చేశారు.పీటీ అండ్ కాలనీ, సొసైటీకాలనీ,కదిరిరోడ్డు ప్రాంతవాసులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. ఆర్డీవో ఎం.ఎస్.మురళి అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

భక్తులను అలరించిన వీణా కచ్చేరి

దసరా ఉత్సవాల్లో భాగంగా వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన వీణా కచ్చేరి భక్తులను అలరించింది. వైష్ణవి లలితా దీపవాహిని బృందం ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన మీనామూర్తి బృందం వీణా కచ్చేరి భక్తులను పరవశింపజేసింది.

లలితాదేవి అలంకరణలో అంకాలమ్మ

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు శనివారం లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అలాగే నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, మీనాక్షి అమ్మవారి అలంకరణ చేపట్టి విశేష పూజలు నిర్వహించారు.

వాల్మీకిపురం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గంగమ్మ గుడివీధిలోని శ్రీ నల్ల వీరగంగాభవాని అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో దుర్గాదేవిగా, చింతపర్తి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

రామసముద్రం : మండలం గుంతయంబాడి గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా శనివారం ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. మండలంలోని దుర్గలమ్మ, కన్యకాపరమేశ్వరి, తిరుమల రెడ్డిపల్లెలోని శ్రీమారెమ్మ, అలాగే కొండూరు, గంపనపల్లె , గుంతలపేటలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పార్వతిదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు పలురకాల నైవేద్యాలను సమర్పించి పూజలు నిర్వహించారు.

లక్ష్మీదేవిగా శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : దశరా మహోత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె పంచాయతీలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు

ములకలచెరువు : స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహానికి నాగదేవతగా ప్రత్యేక అలంకరణ చేశారు.



రామసముద్రం : ప్రత్యేక అలంకారంలో శ్రీచౌడేశ్వరిదేవి



వాల్మీకిపురం: మహాలక్ష్మీదేవిగా కామేశ్వరి అమ్మవారు



గుర్రంకొండ : పార్వతీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి



ములకలచెరువు: నాగదేవత అలంకరణలో అమ్మవారు



పీలేరు : లలితాదేవి అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

వీఆర్వో కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరుకు చెందిన వీఆర్వో శివకుమార్ బి. కొత్తకోట మండలం గట్టు పంచాయతీలో పనిచేస్తూ ఈ నెల 9న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో శనివారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మడుమూరుకు వెళ్లి వీఆర్వో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ మహమూద్, జేసీఎస్ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతి రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

పీలేరు : మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ మారెంరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం మారెంరెడ్డిగారిపల్లెకు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే ఆతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే తోపాటు కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు బాలంనరేంద్రరెడ్డి, షఫీ, డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్లు ఆవిష్కరణ

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలోని కదిరి రోడ్డులో వెలసిన హజ్రత్ మహబూబె సుబహాని ఉరుసు పోస్టర్లను కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 28, 29, 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. దీపోత్సవం, గంధం, ఖవ్వాలి పోటీలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానం

మదనపల్లె సిటీ : క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థానానికి చేరుకుంటారని మదర్‌థెరిస్సా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో మంచి ఉద్యోగ అవకాశాలున్నాయి. భవిష్యత్తులో ఇంజనీరింగ్ విద్యకే అధిక ప్రాధాన్యత ఉందన్నారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి రూ.2.57 లక్షల ఆదాయం

నిమ్మనపల్లె : మండల పరిధిలోని తవళం శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూముల కౌలుకు సంబంధించి నిర్వహించిన వేలంలో రూ.2,57,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. శనివారం శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామికి సంబంధించిన మామిడితోటలను సంవత్సర కాలానికి ఫలసాయానికై తవళం గ్రామంలో దేవదాయశాఖ అధికారి రవికుమార్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. కౌలు ఆదాయాన్ని వాల్మీకిపురంలోని ఇండియన్ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, సర్పంచ్ రెడ్డెప్ప, ఆలయ తాత్కాలికకమిటీ సభ్యులు గోపాలకృష్ణ, గంగాధర, శంకర, రవి, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవవేతనం విడుదలపై హర్షం

మదనపల్లె : పాస్టర్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు అన్నమయ్యజిల్లా వైఎస్సార్ సీపీ క్రైస్తవవిభాగ అధ్యక్షులు బోనాసి జాన్‌బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని గౌతమీనగర్ ఏసుప్రభు చర్చిలో ధనరాజ్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం జరిగింది. కార్యక్రమంలో బోనాసి జాన్‌బాబు మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. పాస్టర్లకు గౌరవవేతనం విడుదల చేసినందుకు కృతజ్ఞతగా థ్యాంకూ జగనన్న కార్యక్రమం నిర్వహించామన్నారు. పాస్టర్లు అహరోన్, శ్యాంసన్, రమణప్ప, మునిరాజు, భయ్యారెడ్డి, సుధాకర్, యోబు, దినకర్, నారాయణప్ప,డేవిడ్‌షాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం



మదనపల్లె : వైద్య శిబిరంలో రక్తపరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



గుర్రంకొండ : సరిమడుగులో వృద్ధులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని సీటీఎం క్రాస్ పంచాయతీ, పట్టణంలోని 29వవార్డు పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఎమ్మెల్యే నవాజ్‌బాషా పరిశీలించారు. సీటీఎం క్రాస్ పంచాయతీలోని వైద్యశిబిరంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా రక్తపరీక్ష చేయించుకున్నారు. శిబిరంలో రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీడీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో మహిళలను ఆశీర్వదించి, సారె అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, అక్కులప్ప, బండపల్లివెంకటరమణ, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జీ.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, షరీఫ్, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, బావాజీ, మునిశేఖర్, 29వవార్డు కౌన్సిలర్ డిష్‌రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

పెద్దతిప్పసముద్రం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ మహమూద్, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రంగసముద్రంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులను పొందారు. సర్పంచ్ బొక్కసం శివ, ఎంపీటీసీ చాప సుజాత, మాజీ సర్పంచ్ నవరాల రవిశంకర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఉచిత వైద్యం

గుర్రంకొండ : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలందరికి ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. శనివారం మండలంలోని గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ఎంపీడీఓ వెంకటేశులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మీ,మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, నక్కానాగరాజ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



మదనపల్లెలో పోలీసుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మదనపల్లె : సమాజానికి చేయూతనిస్తూ, శాంతి భద్రతలు కాపాడుతూ దేశం కోసం వీరమరణం పొందిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐలు మహబూబ్‌బాషా, సత్యనారాయణ అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మదనపల్లె వన్,టూ, తాలూకా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, జ్ఞానాంబిక డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐలు మహబూబ్‌బాషా, సత్యనారాయణలు మాట్లాడుతూ... ప్రజాశ్రేయస్సు, శాంతి భద్రతలే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. . జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, వీఎస్ఆర్ గ్రాండ్స్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

వాల్మీకిపురం : నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ, ప్రాణరక్షణగా నిలిచిన పోలీసుల త్యాగాల్ని మరువలేమని ఎస్ఐ నాగేశ్వర రావు అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా ప్రతి పోలీసు విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలన్నారు.

కలికిరి: పోలీసు అమర వీరు సంస్మరణ దినోత్సవం సందర్భంగా కలికిరి సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ–3) కేంద్రంలో కమాండెంట్ నీరజ్ కుమార్ పాండే ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారిని స్మరించుకుని, నివాళులు అర్పించడం అందరి బాధ్యత అన్నారు.